Digital, tmedia.net.in

# టీ-మీడియా

మెయిన్ ఎడిషన్

సామాజికం.. ప్రజల పక్షం...

సంపుటి : 8
సంచిక : 278
పేజీలు : 3

గురువారం 07.05.2026

GSTIN: 36FDKPS1308P1ZX | Analytics ID: UA-194163459
Domain ID : DC7812B9B3101414BB98847D724E48B3A-IN

ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ

## తప్పిదాల నుంచి పాఠాలు నేర్వని ఇంటర్ బోర్డు

### -ఒక్కరోజు వ్యవధిలోనే షెడ్యూల్ విడుదల, రద్దు




**టీ-మీడియా ,మే 6 ,హైదరాబాద్ బ్యూరో :** తప్పులు, తప్పిదాల నుంచి తెలంగాణ ఇంటర్‌బోర్డు పాఠాలు నేర్వడం లేదు. సోమవారం ఇంటర్ అడ్మిషన్ల షెడ్యూల్ విడుదల చేసి.. మంగళవారమే రద్దు చేసింది. తదుపరి ఉత్తర్వులు వచ్చేవరకు అడ్మిషన్లు నిర్వహించరాదని స్పష్టంచేసింది. తెలంగాణ వార్తలువిద్యా వ్యవస్థలో కీలక సంస్కరణలు, పారదర్శకత కోసం కొత్త మార్గదర్శకాలు రూపొందిస్తున్నామని, త్వరలోనే సవరించిన షెడ్యూల్‌ను విడుదల చేస్తామని వెల్లడించింది. అయితే సోమవారమే అడ్మిషన్ల షెడ్యూల్‌ను బోర్డు విడుదల చేసిన బోర్డు.. ఒకరోజు గడవగానే షెడ్యూల్‌ను నిలిపివేయడం పలు అనుమానాలకు తావిస్తున్నది. అయితే వచ్చే విద్యాసంవత్సరానికి సంబంధించి కాలేజీల అఫిలియేషన్ ప్రక్రియ పూర్తికాలేదు. అనుమతులివ్వకుండానే అడ్మిషన్లు చేపట్టడం వీలు కాదు. ఈ క్రమంలోనే షెడ్యూల్‌ను రద్దుచేసినట్టు పలువురు ప పేర్కొంటున్నారు

# ఆసక్తికరమైన తమిళ రాజకీయాలు

- గవర్నర్‌ను కలిసిన విజయ్
- మద్దతు ఇవ్వమంటున్న లెఫ్ట్ పార్టీలు



**టీ మీడియా ,మే 6, చెన్నై :** తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో అతిపెద్ద పార్టీగా నిలిచిన టీవీకే ప్రభుత్వ ఏర్పాటు కోసం గవర్నర్‌తో సమావేశమైంది. ఈ మేరకు టీవీకే అధినేత విజయ్ గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్‌ను కలిశారు. ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించాలని విజయ్ గవర్నర్‌ను కోరారు. అందుకు గవర్నర్ సమ్మతించారు. ప్రభుత్వ ఏర్పాటుకు విజయ్ సంసిద్ధత వ్యక్తం చేశారు. గురువారమే విజయ్ తమిళనాడు ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఇందుకోసం చెన్నైలోని నెహ్రూ ఇండోర్ స్టేడియంలో భారీ ఎత్తున ఏర్పాట్లు జరుగుతున్నాయి. 5 వేల మంది అతిరథ మహారథులు, కార్యకర్తలు, అభిమానుల మధ్య ప్రమాణస్వీకార కార్యక్రమం జరగనుంది.

అసెంబ్లీ ఎన్నికల్లో విజయ్ పార్టీకి 108 సీట్లు రాగా ప్రభుత్వ ఏర్పాటుకు మరో 10 సీట్లు అవసరం ఉంది. ఈ నేపథ్యంలో తమిళ వెట్రి కళగం (టీవీకే) పార్టీకి షరతులతో కూడిన మద్దతు ఇస్తున్నట్లు కాంగ్రెస్ ప్రకటించింది. ఇందుకు సంబంధించి తమిళనాడు కాంగ్రెస్ ఇంఛార్జ్? గిరీశ్? చోడంకర్? సంతకం చేసిన ఓ లేఖను అధికారికంగా విడుదల చేసింది. లౌకిక ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడంలో టీవీకే అధినేత విజయ్‌కు మద్దతు ఇవ్వాలని తమిళనాడు కాంగ్రెస్ నిర్ణయించినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. అంతకుముందు మంగళవారం రాత్రి తమిళనాడు కాంగ్రెస్ రాజకీయ వ్యవహారాల కమిటీ-ాూజ అత్యవసరంగా సమావేశమై నిర్ణయం తీసుకుంది. బీజేపీ, దాని మిత్ర పక్షాలు ఎట్టి పరిస్థితుల్లో తమిళనాడులో అధికారం చేపట్టకుండా అడ్డుకునేందుకు కృతనిశ్చయంతో ఉన్నామని కాంగ్రెస్ చెప్పింది. అనంతరం కాంగ్రెస్ ఎమ్మెల్యేలు చెన్నైలోని టీవీకే ప్రధాన కార్యాలయానికి వెళ్లి విజయ్‌తో సమావేశమయ్యారు. వాళ్లందరినీ విజయ్ శాలువాలతో సత్కరించారు. ఐదుగురు సభ్యులు ఉన్న కాంగ్రెస్ మద్దతు ఇచ్చినప్పటికీ టీవీకేకు మరో ఐదుగురు ఎమ్మెల్యేల మద్దతు అవసరం ఉంది. ఈ నేపథ్యంలో అన్నాడీఎంకే కూటమిలోని పీఎంకే కూడా విజయ్‌కు మద్దతు ఇచ్చేందుకు సిద్ధమైంది. పీఎంకేకు నలుగురు ఎమ్మెల్యేలు ఉన్నారు.

### ప్రమాణస్వీకారానికి రాహుల్‌గాంధీని ఆహ్వానించిన విజయ్

అటు విజయ్ ప్రమాణస్వీకారానికి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ రానున్నారు. ప్రమాణస్వీకారానికి రాహుల్ గాంధీని విజయ్ ఆహ్వానించినట్లు కాంగ్రెస్ నేత ప్రవీణ్ చక్రవర్తి తెలిపారు. రాహుల్, ఖర్గేతో విజయ్ ఫోన్‌లో మాట్లాడి ప్రమాణ స్వీకారానికి ఆహ్వానించినట్లు చెప్పారు.

### మద్దతు ఇచ్చేది లేదన్న లెఫ్ట్ పార్టీలు

ఇదిలా ఉండగా, తమిళనాడులో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి మద్దతు కోరుతూ టీవీకే వివిధ రాజకీయ పార్టీలను సంప్రదిస్తున్న నేపథ్యంలో కీలక పరిణామం చోటు చేసుకుంది. డీఎంకే మిత్రపక్షమైన వి సి కె దీనిపై ఇంకా ఎటువంటి నిర్ణయం తీసుకోలేదని పార్టీ వర్గాలు తెలిపాయి. అయితే, ఆహ్వానించినప్పటికీ, వామపక్ష పార్టీలు, ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్, సిపిఐ(ఎం)



మాత్రం విజయ్ పార్టీకి మద్దతు ఇచ్చే ప్రసక్తే లేదని స్పష్టం చేశాయి. ఎన్నికల్లో విజయం సాధించిన సిపిఐ(ఎం) అభ్యర్థులు ఆర్. చెల్లస్వామి, లతతో పాటు సీపీఐ సభ్యులు టి. రామచంద్రన్, మారిముత్తు డీఎంకే అధినేత ఎం.కె. స్టాలిన్‌ను కలిశారు. అటు ముస్లిం లీగ్ తరపున ఎమ్మెల్యేలుగా ఎన్నికైన సయ్యద్ ఫరూక్ బాషా, ఏ.ఎం. షాజహాన్ కూడా డీఎంకే అధ్యక్షుడిని కలిశారు. అనంతరం మాట్లాడుతూ తాము డీఎంకేకి తమ మద్దతును కొనసాగిస్తామని సీపీఐ(ఎం), సీపీఐ, శాసనసభ్యులు స్పష్టం చేశారు.

### పళనిస్వామితో టీవీకే నేత సమావేశం

ఇదిలా ఉండగా, టీవీకే ప్రధాన కార్యదర్శి ఆనంద్ అన్నాడీఎంకే అధినేత ఎడప్పాడి పళనిస్వామితో సమావేశం కావడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఇతర టీవీకే నాయకులు కూడా పళనిస్వామితో చర్చించినట్లు తెలిసింది. ఒక వేళ టీవీకే, 47 సీట్లు ఉన్న అన్నా డీఎంకే జతకడితే ప్రభుత్వ ఏర్పాటు మెజార్టీకి ఎలాంటి ఢోకా ఉండదు.

## సీఎం పదవికి హిమంత బిశ్వశర్మ రాజీనామా

### -గవర్నర్‌కు సమర్పించిన రాజీనామా లేఖ



**టీ మీడియా ,మే 6 , న్యూఢిల్లీ:** అసోంలో నూతన ప్రభుత్వ ఏర్పాటుకు మార్గం సుగుమం చేస్తూ ముఖ్యమంత్రి పదవికి హిమంత బిశ్వశర్మ రాజీనామా చేశారు. ఈ మేరకు గువాహటిలో లోక్‌భవన్‌కు వెళ్లి గవర్నర్ లక్ష్మణ్‌ప్రసాద్ ఆచార్యను కలిసి రాజీనామా లేఖను సమర్పించారు. తర్వాత కొద్దినిమిషాలకే హిమంత బిశ్వశర్మ రాజీనామాను గవర్నర్ ఆమోదించారు. కొత్త ప్రభుత్వం ఏర్పడే వరకు ఆపద్ధర్మ సీఎంగా కొనసాగాలని హిమంతను, గవర్నర్ కోరారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, సీఎం ప్రమాణస్వీకారం మే 11 తర్వాత ఉంటుందని తెలిపారు. 'ఎన్నికల ఫలితాలను ఎన్నికల సంఘం అధికారికంగా ప్రకటించిన తర్వాత రాజీనామా సమర్పించాం. ప్రస్తుత అసెంబ్లీని రద్దు చేయాలని కూడా నేను గవర్నర్‌ను అభ్యర్థించా. ఆయన నా రాజీనామాను అంగీకరించి, కొత్త ప్రభుత్వం ఏర్పడే వరకు ముఖ్యమంత్రిగా కొనసాగాలని ఆదేశించారు. కొత్త ప్రభుత్వం త్వరలోనే ఏర్పడుతుందని నేను భావిస్తున్నా. ఈ సమయంలో మేం తాత్కాలిక ప్రభుత్వంగా పనిచేస్తాం' అని బిశ్వ శర్మ పేర్కొన్నారు.

### కొత్త సీఎం ఎంపిక శాసనసభ్యుల సమావేశంలోనే

పార్టీ శాసనసభాపక్ష సమావేశంలో నూతన సీఎం ఎంపిక జరుగుతుందని హిమంత బిశ్వ శర్మ తెలిపారు. 'రాష్ట్రంలో కొత్త ముఖ్యమంత్రిని బీజేపీ శాసనసభ్యుల సమావేశంలోనే ఎంపిక చేస్తామని తెలిపారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్, జేపీ నడ్డా, బరియాణా ముఖ్యమంత్రి నాయబ్ సింగ్ సైనిను కేంద్ర పరిశీలకులుగా నియమించారు. శాసనసభ్యుల సమావేశంలో నేతను ఎన్నుకుంటాం. ఆ తర్వాత లోక్ భవన్‌కు వెళ్లి ప్రభుత్వం ఏర్పాటు కోసం గవర్నర్‌ను కలుస్తాం. కొత్త ప్రభుత్వ ప్రమాణ స్వీకారం మే 11 తర్వాత జరిగే అవకాశం ఉంది. మహోత్సవానికి ప్రధాని నరేంద్ర మోదీని ఆహ్వానించాం. ఈసారి సెంచరీతో హ్యాట్రిక సాధించినందుకే ప్రధానిని ఆహ్వానిస్తున్నాం' అని హిమంత బిశ్వ శర్మ తెలిపారు. అసోం నూతన సీఎంగా మరోసారి హిమంత బిశ్వశర్మ పగ్గాలు చేపట్టే అవకాశం ఉంది.

### డిజిటల్ స్ట్రాటజీతో ప్రచారం

అసోం అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయానికి డిజిటల్ వ్యూహం కీలక పాత్ర పోషించింది. ఈ వ్యూహం వల్ల ఎన్?డీఏ 100కి పైగా స్థానాలు సాధించింది. దీంతో మూడోసారి అధికారంలోకి వచ్చింది. బీజేపీ డిజిటల్ టీమ్, సోషల్ మీడియాలో కథనాలు, మీమ్స్, యువతను ఆకట్టుకునే కంటెంట్ ద్వారా ఎన్నికల వాతావరణాన్ని పూర్తిగా తమవైపు మళ్లించింది.

### 'మామా' ఇమేజ్‌తో ప్రజలలో విశ్వాసం

సీఎం హిమంత బిశ్వ శర్మను 'మామా'గా ప్రజల్లో ప్రతిష్ఠిస్తూ, ఆయనను స్థానిక సంస్కృతికి రక్షకుడిగా చూపించింది. అభివృద్ధి, ఆధునికత, ప్రాంతీయ గౌరవం అనే అంశాలను కలిపి బలమైన కథనాన్ని రూపొందించింది. ఈ డిజిటల్ ప్రచారం ద్వారా ప్రతిపక్షాన్ని, ముఖ్యంగా కాంగ్రెస్?ను తీవ్రంగా లక్ష్యంగా చేసుకుంది. బీజేపీ ప్రచారం కాంగ్రెస్‌ను అసోం అభివృద్ధికి అడ్డంకిగా చూపించింది. అక్రమ వలసదారులకు మద్దతు ఇస్తోందనే ఆరోపణలతో కాంగ్రెస్‌పై ప్రతికూల భావనను పెంచింది.ఈ నారేటివ్ ప్రజల్లో విస్తృతంగా వ్యాపించి, ప్రతిపక్షానికి పెద్ద దెబ్బగా మారింది.

### ఎన్నికల్లో ఎన్?డీఏ ఆధిపత్యం

అస్సాం అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఆధ్వర్యంలోని ఎన్?డీఏ ఘన విజయం సాధించింది. మొత్తం 126 స్థానాల్లో 102 సీట్లు గెలుచుకుని వరుసగా మూడోసారి అధికారంలోకి రాబోతోంది. బీజేపీ 82 స్థానాలు గెలుచుకోగా, ఏజీపీ, బీఓపీఎఫ్ తలో 10 స్థానాలు సాధించాయి. ఇక కాంగ్రెస్ కేవలం 19 స్థానాల్లో మాత్రమే గెలుపొందింది. రైజోర్ దళ్ 2 స్థానాలు గెలుచుకోగా, ఏఐయూడీఎఫ్ కూడా 2 స్థానాలు సాధించింది. అసోం జాతీయ పరిషత్ (ఏజేపీ) ఒక్క సీటు కూడా గెలుచుకోలేక పోయింది.


## కాగ్నిజెంట్‌లో 15 వేల మందిపై వేటు




**టీ మీడియా ,మే 6 , న్యూఢిల్లీ:** ఐటీ రంగంలో ఉద్యోగాల భద్రతపై అస్థిరత కొనసాగుతున్న వేళ కాగ్నిజెంట్ తన ఉద్యోగుల్లో 15 వేల మందిపై వేటు వేయడానికి సిద్ధమవుతున్నది! ఇందులోనూ ఎక్కువ మంది ఉద్యోగులు భారత్‌లో పనిచేసే వారే అయ్యుంటారని మనీ కంట్రోల్ వెబ్‌సైట్ పేర్కొన్నది. ప్రపంచవ్యాప్తంగా తమ సంస్థలో 12-15 వేల మంది ఉద్యోగులను తగ్గించుకొనే ఆలోచన చేస్తున్నట్టు కాగ్నిజెంట్ యజమాన్యం తెలిపింది.గత నెల 29న నాస్డాక్‌లో నమోదైన కాగ్నిజెంట్, ప్రాజెక్ట్ లీప్ అనే కార్యక్రమం కింద 230-320 మిలియన్ల ధనాన్ని ఉద్యోగ విరమణ పరిహార ఖర్చుల కింద ఖర్చు చేయాలని అంచనా వేస్తున్నట్టు తెలిసింది. క్లయింట్లు కొత్తగా ఉద్యోగంలో చేరే వారి (ఫ్రెషర్లు) శిక్షణ కోసం నిధులు ఇవ్వడానికి ఆసక్తి చూపడం లేదని.. దీంతో కంపెనీలు ఉద్యోగుల సంఖ్యను తగ్గించుకోవడానికి ఆలోచిస్తున్నాయని విశ్లేషకులు తెలిపారు.సీనియర్ ఉద్యోగుల నెలవారీ జీతం, వారిని తొలగిస్తే ఇవ్వాల్సిన పరిహార ఖర్చులను బేరీజు వేసుకొని ఉద్యోగులను తొలగించాలని కాగ్నిజెంట్ ప్రణాళికలను వేస్తున్నది. కంపెనీ సీఈవో రవి కుమార్ మాట్లాడుతూ 'విశాలమైన, పొట్టిదైన పిరమిడ్' నిర్మాణం నమూనాను అనుసరించి ఉద్యోగులను తొలగిస్తామని చెప్పారు. ఈ నమూనా ఆటోమేషన్ ప్రభావాన్ని సూచిస్తుందన్నారు.

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటన





**టీ-మీడియా ,మే 6 ,హైదరాబాద్ బ్యూరో :** తెలంగాణ ముఖ్యమంత్రి బుధవారం ఢిల్లీ పర్యటనకు వెళ్లారు. ఈ పర్యటనలో కేంద్ర మంత్రులు, కాంగ్రెస్ అగ్రనేతలతో కీలక సమావేశాలు నిర్వహించనున్నారు. హైదరాబాద్ మెట్రో ఫేజ్-2 విస్తరణకు కేంద్ర అనుమతులు సాధించడం ఈ పర్యటనలో ప్రధాన అజెండాగా ఉన్నట్లు సమాచారం.అదే సమయంలో, కాళేశ్వరం ప్రాజెక్ట్ వ్యవహారంపై జరుగుతున్న దర్యాప్తు అంశంలో సీబీఐ డైరెక్టర్‌తో కూడా సీఎం సమావేశమయ్యే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు చెబుతున్నాయి. విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు మరియు ఇతర అవకతవకలపై లోకూర్ కమిషన్ నివేదికను కూడా సమర్పించే అవకాశముందని వార్తలు వెలువడ్డాయి.ఇక కాంగ్రెస్ పార్టీ పరంగా కూడా ఈ ఢిల్లీ పర్యటనకు ప్రాధాన్యం ఏర్పడింది. తెలంగాణ కాంగ్రెస్‌లో పెండింగ్‌లో ఉన్న వర్కింగ్ ప్రెసిడెంట్ల నియామకాలు, కార్పొరేషన్ చైర్మన్ పోస్టులు, కేబినెట్ విస్తరణ వంటి అంశాలపై అధిష్ఠానంతో సీఎం చర్చించనున్నారని సమాచారం.ప్రధాని మే 10న హైదరాబాద్ పర్యటనకు రానున్న నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటన రాజకీయంగా కూడా ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ పర్యటన అనంతరం తెలంగాణ రాజకీయాల్లో కీలక నిర్ణయాలు వెలువడే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.

## సబ్‌రిజిస్ట్రార్ అండతో అక్రమాలు

- పోలీసుల అదుపులో ఐదుగురు నిందితులు




**టీ-మీడియా ,మే 6 ,హైదరాబాద్ బ్యూరో :** హైదరాబాద్ శివార్లలోని ప్రైవేట్ ప్లాట్లకు నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి కొన్ని ముఠాలు కబ్జా చేస్తున్నాయి. అనంతరం అవి ఇతరులకు అమ్మి సొమ్ము చేసుకుంటున్నాయి. ఈ కబ్జాలకు సంబంధించి కీసర పోలీస్ స్టేషన్ పరిధిలోనే 8 కేసులు నమోదయ్యాయి. దీంతో డాక్యుమెంట్ రైటర్ ఉదయ్‌రెడ్డితోపాటు జంగాల శ్రీరామ్, గుబ్బల వెంకటేశ్వర్‌రావు అలియాస్ జీవీఆర్, బందెల్ల ప్రశాంత్ అలియాస్ బాబి, బందెల్ల ప్రభాకర్, పొన్నబోయిన బాలకృష్ణ అలియాస్ బాలు అనే నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. వారిని లోతుగా ప్రశ్నించడంతో కీసర సబ్‌రిజిస్ట్రార్ రెహమాన్ సాయం చేసినట్టు వెల్లడైంది. ఒక్కో నకిలీ డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్‌కు రెహమాన్ రూ.5 లక్షల వరకు వసూలు చేసినట్టు వెలుగులోకి వచ్చింది. దీంతో రెహమాన్‌ను ప్రధాన నిందితుడిగా చేర్చి అరెస్టు చేయాల్సిన పోలీసులు ఆ విషయాన్ని పక్కన పెట్టేసినట్టు సమాచారం. రెహమాన్ హయాంలో దాదాపు 100 నకిలీ డాక్యుమెంట్లు రిజిస్టరైనట్టు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

## 51 మంది ప్రభుత్వ డాక్టర్లు విధులకు డుమ్మా

### -అందరి ఉద్యోగాలు తొలగించిన సర్కార్



**టీ మీడియా ,మే 6, అమరావతి:** డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) పరిధిలోని ప్రభుత్వ వైద్య కళాశాలలు, బోధనాసుపత్రుల్లో పనిచేస్తున్న 51 మంది వైద్యులను విధుల నుంచి తొలగించినట్లు మంత్రి తెలిపారు. వీరిలో 8 మంది అసోసియేట్ ప్రొఫెసర్లు, 41 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు, ఇద్దరు ట్యూటర్లు ఉన్నారని పేర్కొన్నారు. ఏపీ సివిల్ సర్వీసెస్ కండక్ట్ రూల్స్ ప్రకారం ఏడాదికిపైగా విధులకు గైర్హాజరవుతున్న వారిని ఉద్యోగానికి రాజీనామా చేసినట్లుగా పరిగణించి చర్యలు తీసుకునే అధికారం ప్రభుత్వానికి ఉందని మంత్రి సత్యకుమార్ తెలిపారు. అయితే నేరుగా చర్యలు తీసుకోకుండా ముందుగా సంజాయిషీ నోటీసులు ఇచ్చి సమయం కూడా ఇచ్చామని వివరించారు. అయినప్పటికీ స్పందించకపోవడంతో చివరకు తొలగింపు చర్యలు తీసుకున్నామన్నారు.

### ఆరేళ్లు, ఏడేళ్లుగా విధులకు దూరం

విధుల నుంచి తొలగించిన వారిలో కొందరు చాలా కాలంగా ఆస్పత్రులకు రాకపోవడం బయటపడింది. ఆంధ్ర వైద్య కళాశాలకు చెందిన ఓ అసోసియేట్ ప్రొఫెసర్ 2020 ఫిబ్రవరి నుంచి విధులకు హాజరుకావడం లేదని అధికారులు గుర్తించారు. మరికొందరు 2022 నుంచి కూడా విధులకు దూరంగా ఉన్నట్లు తేలింది. ట్యూటర్లలో ఒకరు ఏకంగా ఏడేళ్లుగా విధులకు రాకపోవడం సంచలనంగా మారింది. కడప, అనంతపురం, ఒంగోలు, తిరుపతి, విజయవాడ, కాకినాడ, విశాఖపట్నం, విజయనగరం, రాజమహేంద్రవరం, ఏలూరు, నెల్లూరు, మార్కాపురం ప్రభుత్వ వైద్య కళాశాలలకు చెందిన వైద్యులు ఈ జాబితాలో ఎక్కువగా ఉన్నారు.

### సొంత వ్యాపకాలతో డ్యూటీలకు గైర్హాజరు

ప్రభుత్వ వర్గాల సమాచారం ప్రకారం.. కొందరు వైద్యులు సొంత వ్యాపకాలు, ప్రైవేట్ ప్రాక్టీసులు చూసుకుంటూ ప్రభుత్వ విధులకు దూరంగా ఉన్నట్లు గుర్తించారు. గత ప్రభుత్వ హయాంలో ఇలాంటి పరిస్థితులు ఎక్కువగా ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. రెగ్యులర్ నియామకాల ద్వారా ప్రభుత్వ సేవల్లో చేరినప్పటికీ.. కొందరు ఆస్పత్రులకు రాకుండా వేతనాలు పొందుతున్నారన్న ఫిర్యాదులు చాలా కాలంగా వస్తున్నాయి. దీనివల్ల బోధనాసుపత్రుల్లో వైద్య సేవలు దెబ్బతింటున్నాయని ప్రభుత్వం భావించింది. ప్రత్యేకంగా మెడికల్ కాలేజీల్లో అధ్యాపకుల కొరత కారణంగా విద్యార్థులు, రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని నివేదికలు రావడంతో ప్రభుత్వం కఠిన చర్యలకు దిగింది.

# మంచిర్యాల జిల్లాలో ఈదురు గాలుల బీభత్సం

- ధాన్యం కాపాడే క్రమంలో రేకుల షెడ్డు కూలి
- నలుగురు రైతులు మృతి



**టీ మీడియా ,మే 6 , మంచిర్యాల :** మంచిర్యాల జిల్లాలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. లక్షెట్టిపేట మండలంలోని మంగళవారం అర్ధరాత్రి ఈదురు గాలుల బీభత్సం సృష్టించాయి. ఈ క్రమంలోనే చోటుచేసుకున్న రెండు వేర్వేరు ఘటనల్లో నలుగురు వ్యక్తులు ప్రాణాలు కోల్పోయారు. వీరిలో తండ్రీ కుమారులు ఉన్నారు. అసలేం జరిగిందంటే? భారీ ఈదురు గాలులకు పలు ప్రాంతాల్లో చెట్లు, విద్యుత్ స్తంభాలు విరిగి పడ్డాయి.

మంచిర్యాల జిల్లాలోని లక్షెట్టిపేట మండలం కొత్తూరు గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద కొంతమంది రైతులు ఉన్నారు. ఈ క్రమంలోనే ఒక్కసారిగా ఈదురు గాలులు చుట్టుముట్టాయి. దీంతో సమీపంలోని ఓ గోడ పక్కకు వెళ్లి తలదాచుకున్నారు. అదే సమయంలో దండేపల్లి మండలం ముత్యంపేటకు చెందిన నీలికి లచ్చన్న(55) అనే వ్యక్తి తన కుమారుడి హైదరాబాద్? బయలు దేరుతుండటంతో బస్సు ఎక్కించేందుకు లక్షెట్టిపేటకు వెళ్లి తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా ఒక్కసారిగా ఈదురు గాలులు పెరగడంతో తను కూడా కొత్తూరు కొనుగోలు కేంద్రంలోకి వెళ్లారు. కొంత సమయానికే అక్కడ ఒక్కసారిగా గోడ కూలడంతో లచ్చన్న, రైతు గుండారపు వెంకటేశ్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనలో మరో నలుగురికి గాయాలయ్యాయి.

రేకుల షెడ్డు కూలి తండ్రీ కుమారుల మృతి మరో ఘటనలో గంపలపల్లి గ్రామ వాసి తనువుల నాగరాజు (44), అతడి కుమారుడు అభిరామ్?లు (22) స్థానికంగా ఉన్న ధాన్యం కొనుగోలు కేంద్రంలో ఆరబోసిన వడ్లపై టార్పాలిన్?ను కప్పేందుకు వెళ్లారు. గాలి తీవ్రత ఎక్కువగా ఉండటంతో పక్కనే ఉన్న రేకుల షెడ్డులోకి వెళ్లి తలదాచుకున్నారు. ఈ క్రమంలోనే గాలి ధాటికి రేకుల షెడ్డు ఒక్కసారిగా కుప్పకూలడంతో అభిరాం అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. నాగరాజుకు తీవ్రంగా గాయాలు అయ్యాయి. ఆయన్ను హుటాహుటిన కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు హాస్పిటల్?కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందారు.

# ఆయిల్ పామ్ సాగుతో రైతులకు బంగారు భవిష్యత్తు

- -డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి



**టీ మీడియా, మే 6, వనపర్తి బ్యూరో:** తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా నిర్వహిస్తున్న రైతు వారోత్సవాల్లో ఉద్యాన పంటల సాగు, ఆయిల్ పామ్ విస్తీర్ణం పెంపు, ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన కార్యక్రమం వనపర్తి జిల్లా కేంద్రంలోని దాచ లక్ష్మయ్య ఫంక్షన్ హాల్‌లో మంగళవారం జరిగింది. కార్యక్రమానికి రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ చిన్నారెడ్డి మాట్లాడుతూ ప్రపంచంలో అత్యధిక వంటనూనె ఉత్పత్తి చేసే పంటల్లో ఆయిల్ పామ్ ప్రధానమని తెలిపారు. మలేషియా వంటి భూమధ్యరేఖ సమీప దేశాల్లో అనుకూల వాతావరణం కారణంగా ఆయిల్ పామ్ సాగు విస్తృతంగా జరుగుతోందన్నారు. భారతదేశంలో వంటనూనె అవసరాలు పెరుగుతున్న నేపథ్యంలో దిగుమతులపై ఆధారపడాల్సి వస్తోందని, దీనిని తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం ఆయిల్ పామ్ సాగుకు ప్రోత్సాహకాలు అందిస్తోందని చెప్పారు. ఆయిల్ పామ్ సాగు చేసే రైతులకు గుంతల తవ్వకం, డ్రిప్ ఇరిగేషన్, ఎరువులు, రవాణా వంటి సదుపాయాలను ప్రభుత్వం కల్పిస్తోందని తెలిపారు. ఆయిల్ పామ్ తోటల్లో కోకో, జాజికాయ వంటి అంతర పంటలు సాగు చేస్తే రైతులకు ఏడాది పొడవునా స్థిరమైన ఆదాయం లభిస్తుందని పేర్కొన్నారు. ఆయిల్ పామ్ సాగు చేసిన మూడు సంవత్సరాల తర్వాత దిగుబడి ప్రారంభమవుతుందని, కోసిన గెలలను 24 గంటల్లో ప్రాసెసింగ్ యూనిట్లకు తరలించేలా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. భవిష్యత్తులో ఆయిల్ పామ్‌కు మంచి డిమాండ్ ఉంటుందని, రైతులు పంటల మార్పిడి ద్వారా మొక్కజొన్న, పత్తి, ఆముదం, కూరగాయల సాగుతో కూడా అధిక లాభాలు పొందవచ్చని అన్నారు. సంకిరెడ్డిపల్లి, బీచ్‌పల్లి సమీపాల్లో నిర్మాణంలో ఉన్న ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ ఫ్యాక్టరీలను త్వరలో పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. రైతును రాజుగా తీర్చిదిద్దడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. కార్యక్రమంలో రైతు కమిషన్ సభ్యురాలు భవాని రెడ్డి, రిటైర్డ్ వ్యవసాయ అధికారి కృపాకర్ రెడ్డి, జిల్లా హార్టికల్చర్ అధికారి విజయభాస్కర్ రెడ్డి, శాస్త్రవేత్త రాజేందర్ రెడ్డి, మోజర్ల హార్టికల్చర్ కళాశాల ప్రిన్సిపాల్ వీణ జోషి, కాంగ్రెస్ నాయకులు చెన్నయ్య, బాల్‌రాజు, సిరివాటి సురేష్, గట్టు రాజు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక 99 రోజుల

- కార్యక్రమంలో రైతు వారోత్సవం



**టీ మీడియా, మే6, పెబ్బేరు:** ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా మున్సిపాలిటీ వ్యవసాయ మార్కెట్ కమిటీలో రైతు వారోత్సవం నిర్వహించారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో జరిగిన ఈ అవగాహన కార్యక్రమానికి మార్కెట్ కమిటీ చైర్మన్ గౌని ప్రమోదిని రెడ్డి, వైస్ చైర్మన్ ఎద్దుల విజయవర్ధన్ రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రైతులకు వ్యవసాయ ఉత్పత్తులు, మార్కెట్ సేవలు, ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తోందని, వరి పండించే రైతులకు క్వింటాల్‌కు రూ. 2,389 మద్దతు ధరతో పాటు రూ. 500 బోనస్ అందజేస్తోందని తెలిపారు. అలాగే మొక్కజొన్న రైతులకు క్వింటాల్‌కు రూ. 2,400 మద్దతు ధర కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. మొక్కజొన్న సాగులో ఎకరానికి 30 నుంచి 40 క్వింటాళ్ల వరకు దిగుబడి సాధించే అవకాశం ఉందని, రైతులు పంట మార్పిడి విధానాన్ని పాటిస్తే అధిక లాభాలు పొందవచ్చని సూచించారు. ప్రస్తుతం పెబ్బేరు వ్యవసాయ మార్కెట్ కమిటీలో వరి, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. బ్యాంకుల ద్వారా తక్కువ వడ్డీ రేట్లపై పంట రుణాలు అందుబాటులో ఉన్నాయని, రైతులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, వైస్ చైర్మన్ సుమిత్ర ఎల్లారెడ్డి, సింగిల్ విండో చైర్మన్ గౌని కోదండరాం రెడ్డి, వైస్ చైర్మన్ ఆంజనేయులు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, ఎంపీడీఓ, వ్యవసాయ అధికారులు, ఎస్‌బీఐ మేనేజర్, మార్కెట్ కార్యదర్శి, సింగిల్ విండో సీఈఓ, ఏపీఎంలు, ఐకేపీ, మెప్మా సంఘాల సభ్యులు, కాంగ్రెస్ నాయకులు యుగేందర్ రెడ్డి, రంజిత్ కుమార్, ఎల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అధికారులంతా చిత్తశుద్ధితో పని చేయాలి

- రాష్ట్ర క్రీడ ప్రాధికార సంస్థ చైర్మన్ శివసేన రెడ్డి



**టీ మీడియా, మే 6, వనపర్తి బ్యూరో :** ప్రజాపాలన ప్రభుత్వం రైతుల పక్షపాతిగా పనిచేస్తుందని, రైతులకు ఎలాంటి ఆటంకాలు, ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవలసిన బాధ్యత అధికారులకు ఉందని, వడ్ల కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు అన్ని సదుపాయాలు ఏర్పాటు చేసి రైతులకు గిట్టుబాటు ధరకే కొనుగోలు చేయాలని డిసిసి చీఫ్, రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ శివసేన రెడ్డి అన్నారు. బుధవారం వనపర్తి మండలం పెద్దగూడెం గ్రామంలో ఐకెపి సెంటర్లు ద్వారా ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని రైతులు పిలవడంతో ఆయన సందర్శించారు. ఐకెపి సెంటర్లు నిర్వహణ తీరును పరిశీలించి, రైతులతో మాట్లాడారు. ఐకెపి , మెప్మా, కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. అలాగే దళారులు తరువు పేరుతో రైతులను మోసం చేస్తున్నారని రైతులు విన్నవించడంతో వెంటనే స్పందించి జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభితో చరవాణిలో మాట్లాడి పలు సమస్యలను వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల కోసం చిత్తదేవులతో పనిచేస్తుందని చిన్నచిన్న పొరపాట్లు ఉంటే వెంటనే సరి చేయాలని అధికారులకు సూచించారు. ఎట్టి పరిస్థితుల్లో ప్రభుత్వానికి చెడ్డ పేరు తీసుకురాకుండా పనిచేయాలని అన్నారు. కొనుగోలు కేంద్రాల్లో త్రాగునీరు, టెంటు, తేమ శాతానికి సంబంధించిన పరికరాలు , వర్షం వస్తే ధాన్యం తడవకుండా ముందస్తు ప్రణాళికలతో కొనుగోలు కేంద్రాల నిర్వహకులు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ఆయన వెంట ఆ గ్రామ సర్పంచ్ పుష్పలత శివకుమార్, ఉపసర్పంచ్ పోల్లికమ్మ, రైతులు, పలువురు కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

## ఎల్ ఓ సి అందజేసినజిల్లెళ్ళ చిన్నారెడ్డి



**టీ మీడియా ,మే 6 ,పెబ్బేరు:** పెబ్బేరు మండలంలోని రాంపురం గ్రామానికి చెందిన పుట్ట రవి ఆర్థిక స్థోమత లేక ఆర్థోపెడిక్ కు సంబంధించిన ఆపరేషన్ కోసం రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి ని సంప్రదించగా వారు వెంటనే స్పందించి వారి ఆపరేషన్ కోసం మూడు లక్షల రూపాయల విలువైన ఎల్ ఓ సి ని ఇప్పించడం జరిగింది ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సహదేవుడు ముదిరాజు పాతపల్లి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్న పలుస శంకర్ గౌడ్



**టీ మీడియా, మే 6, వనపర్తి బ్యూరో :** తిరుమలలో వెంకటేశ్వర స్వామిని సాహితీ కళా వేదిక వనపర్తి జిల్లా అధ్యక్షులు పలుస శంకర్ గౌడ్దర్శించుకున్నారు. కవులు, కళాకారులు సాహిత్యవేతలకు వెంకటేశ్వర స్వామి ఆశీస్సులు ఉండాలన్నారు. సమాజములోని ప్రజలను జాగృతి పరిసి మంచి సమాజం రూపుదిద్దికోవడాని రచనలు , పాటలు ఉండేట్లు కవుల రచనలు, గాయకుల పాటలు ఉండాలి. వెంకటేశ్వర స్వామి ఆశీస్సులు ఉండాలని కోరుకున్నారు.

## అమృత్ 2,0 పనులు వేగంగా చేయాలి



**టీ మీడియా, మే 6, పెబ్బేరు :** పెబ్బేరు పట్టణంలోఅదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఖిమ్యా నాయక్ పెబ్బేరు మున్సిపాలిటీలో అమృత్ 2.0 పనులను పరిశీలించారు ఈ సందర్భంగా అక్కడ జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిని ఆయన సమీక్షించారు పనుల నాణ్యత వేగం సమయపాలనపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని అధికారులకు సూచించారు ప్రజలకు ఉపయోగపడే విధంగా పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు అదనంగా పనుల నిర్వహణలో ఎటువంటి నిర్లక్ష్యం ఉండకూడదని ప్రతి దశలో పర్యవేక్షణ పెంచాలని అధికారులకు స్పష్టమైన దిశానిర్దేశాలు ఇచ్చారు. మున్సిపాలిటీ చైర్పర్సన్ అక్కి శ్రీనివాస్ గౌడ్ కమీషనర్ ఖాజా అరిపుద్దీన్, తదితరులు ఉన్నారు.

## వివాహ వేడుకలో పాల్గొన్న స్పోర్ట్స్

-అథారిటీ ,మున్సిపల్ చైర్మన్



**టీ మీడియా, మే 6,పెబ్బేరు:** పెబ్బేరు పట్టణంలోనీ ఆరో వార్డు కౌన్సిలర్ తాటికొండ కృష్ణ అన్న కుమారుని వివాహ వేడుకల్లో పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి, మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్, వైస్ చైర్మన్ సుమిత్రా ఎల్లరెడ్డి, కౌన్సిలర్ లు తాటి కొండ శివ, భాగ్యలక్ష్మి, శివ వినయ్, యూత్ కాంగ్రెస్ శివ, కాంగ్రెస్ నాయకులు,తదితరులు వివాహ వేడుకల్లో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించడం జరిగింది.

## నూతన గృహప్రవేశ వేడుకకు హాజరైన

- చైర్మెన్ సురగౌని శ్రీనివాస్ గౌడ్



**టీ మీడియా, మే 6, వనపర్తి బ్యూరో :** కొల్లాపూర్ నియోజకవర్గం పెంట్లవెల్లి మండల పరిధిలోని కొండూరు గ్రామానికి చెందిన ఆత్మీయ సహోదరులు పలుస రాఘవేంద్ర గౌడ్ , విజయలక్ష్మి ఆహ్వానం మేరకు నూతన గృహ ప్రవేశ వేడుకకు బుధవారం శ్రీ గాయత్రి ఎడ్యుకేషన్స్ చైర్మెన్ సురగౌని శ్రీనివాస్ గౌడ్ హాజరై తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం గ్రామంలోని వారి ఆత్మీయులతో మాట్లాడి బాగోగులు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక మిత్రులు, సహోదరులు, శ్రేయోభిలాషులు తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ సమస్యలు


- దీర్ఘకాలిక ప్రణాళికలు అవసరమని



**టీ-మీడియా ,మే 6 హైదరాబాద్:** హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ సమస్యలు రోజురోజుకూ మరింత తీవ్రమవుతున్నాయి. ముఖ్యంగా ఐటీ కారిడార్, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, హైటెక్ సిటీ, గచ్చిబౌలి, కూకట్‌పల్లి, ఎల్బీనగర్ ప్రాంతాల్లో ఉదయం మరియు సాయంత్రం వేళల్లో వాహనదారులు గంటల తరబడి ట్రాఫిక్‌లో చిక్కుకుంటున్నారు. ఇటీవల పెరిగిన వాహనాల సంఖ్య, రోడ్ల విస్తరణ పనులు, మెట్రో నిర్మాణ ప్రాంతాలు, అకాల వర్షాల కారణంగా రహదారులు దెబ్బతినడం వంటి అంశాలు ట్రాఫిక్ సమస్యలను మరింత పెంచుతున్నాయని అధికారులు చెబుతున్నారు. ప్రత్యేకంగా ఐటీ ఉద్యోగులు కార్యాలయాలకు వెళ్లే సమయాల్లో హైటెక్ సిటీ--గచ్చిబౌలి మార్గంలో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడుతోంది. కొన్నిచోట్ల సిగ్నల్ వ్యవస్థ సరిగా పనిచేయకపోవడం, అక్రమ పార్కింగ్, రోడ్లపై గుంతలు కూడా సమస్యను మరింత క్లిష్టం చేస్తున్నాయి. ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు:కార్యాలయాలకు ఆలస్యంగా ,ఇంధన వ్యయం పెరగడం,మానసిక ఒత్తిడి, అలసట,అత్యవసర సేవలకు ఆటంకంట్రాఫిక్ సమస్యలపై ప్రజలు సోషల్ మీడియాలో తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. “రోడ్లపై గడిపే సమయం కుటుంబంతో గడిపే సమయం కంటే ఎక్కువగా మారింది” అని పలువురు వాపోతున్నారు. ఈ పరిస్థితిపై ట్రాఫిక్ పోలీసులు, జీహెచ్ఎంసీ అధికారులు స్పందిస్తూ:ముఖ్య కూడళ్ల వద్ద ప్రత్యేక ట్రాఫిక్ సిబ్బందిని నియమిస్తున్నామని,స్మార్ట్ సిగ్నల్ వ్యవస్థను విస్తరిస్తున్నామని,అక్రమ పార్కింగ్‌పై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అయితే, నగర జనాభా మరియు వాహనాల సంఖ్య వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో దీర్ఘకాలిక ప్రణాళికలు అవసరమని నిపుణులు సూచిస్తున్నారు. ప్రజల సూచనలు ప్రజా రవాణాను మరింత బలోపేతం చేయాలి,కొత్త ఫ్లైఓవర్లు, సర్వీస్ రోడ్లు నిర్మించాలి,పీక్ అవర్స్‌లో భారీ వాహనాల రాకపోకలను నియంత్రించాలి,మెట్రో సేవలను మరింత విస్తరించాలి.

# ఖమ్మం-దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్

- శరవేగంగా హైవే పనులు




**టీ-మీడియా ,మే 6 ,హైదరాబాద్ బ్యూరో :** కేంద్ర ప్రభుత్వ భారత్‌మాల పరియోజన కింద నిర్మిస్తున్న ఈ అత్యాధునిక ఎక్స్‌ప్రెస్ హైవే పూర్తయితే హైదరాబాద్--విశాఖపట్నం మధ్య ప్రయాణంలో భారీ మార్పు రానుంది. ప్రస్తుతం విజయవాడ మీదుగా వెళ్లే మార్గంతో పోలిస్తే ఈ కొత్త హైవే ద్వారా సుమారు 56 నుంచి 80 కిలోమీటర్ల వరకు దూరం తగ్గనుండగా, ప్రయాణ సమయం కూడా 3 నుంచి 4 గంటల వరకు ఆదా కానుంది. మొత్తం 162 కిలోమీటర్ల పొడవుతో నిర్మిస్తున్న ఈ గ్రీన్‌ఫీల్డ్ హైవేలో తెలంగాణలో సుమారు 105 కిలోమీటర్లు, ఆంధ్రప్రదేశ్‌లో 57 కిలోమీటర్ల మేర రహదారి ఉంటుంది. రూ. 4,451 కోట్లకు పైగా వ్యయంతో నిర్మిస్తున్న ఈ ప్రాజెక్టును ఐదు ప్యాకేజీలుగా విభజించి పనులు చేపట్టారు. ఇప్పటికే చాలా భాగంలో నాలుగు లేన్ల రహదారి సిద్ధమై, కొన్నిచోట్ల వాహనాల రాకపోకలు కూడా ప్రారంభమయ్యాయి. ఖమ్మం జిల్లా వైరా సమీపంలోని సోమవరం వద్ద ఇప్పటికే టోల్ ప్లాజా ప్రారంభమైంది. తల్లంపాడు, వెంకటగిరి క్రాస్‌రోడ్డు, ధంసలాపురం, దేవరపల్లి ప్రాంతాల్లో మిగిలిన పనులు తుది దశలో ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. రహదారిపై ఎ ఐ ఆధారిత సీసీ కెమెరాలు, సోలార్ స్ట్రీట్ లైట్లు, 1033 ఎమర్జెన్సీ హెల్ప్‌లైన్, ప్రతి 18 కిలోమీటర్లకు ఎంట్రీ--ఎగ్జిట్ పాయింట్లు, ప్రతి 5 కిలోమీటర్లకు ఎమర్జెన్సీ మీడియన్ ఓపెనింగ్స్ వంటి ఆధునిక సదుపాయాలు ఏర్పాటు చేస్తున్నారు. ఈ హైవే వల్ల ఖమ్మం, ఏలూరు, తూర్పుగోదావరి జిల్లాల మధ్య రవాణా మరింత వేగవంతం కానుంది. ముఖ్యంగా బొగ్గు, గ్రానైట్, కలప, వ్యవసాయ ఉత్పత్తులు, పారిశ్రామిక సరుకుల రవాణాకు ఇది కీలక మార్గంగా మారనుంది. స్థానిక రైతులు తమ ఉత్పత్తులను మార్కెట్లకు వేగంగా తరలించే అవకాశం లభించనుంది. అలాగే భవిష్యత్తులో లాజిస్టిక్ హబ్‌లు, గిడ్డంగులు, పారిశ్రామిక అభివృద్ధికి ఈ హైవే బలమైన వేదికగా నిలవనుంది. అత్యాధునిక సాంకేతికతతో నిర్మిస్తున్న ఈ గ్రీన్‌ఫీల్డ్ హైవేపై గరిష్ఠ వేగ పరిమితిని 100 కిలోమీటర్లుగా నిర్ణయించారు. ద్విచక్ర వాహనాలు, ఆటోలు, ట్రాక్టర్లకు అనుమతి ఉండదు. ప్రమాదాల నివారణ కోసం ప్రత్యేక పెట్రోలింగ్ వ్యవస్థను కూడా ఏర్పాటు చేస్తున్నారు.

## పురపాలక సంఘం ఆధ్వర్యంలో చలివేంద్రాలు ప్రారంభం




**టీ మీడియా, మే 6, రామకృష్ణాపూర్;** క్యాతనపల్లి మున్సిపాలిటీ రామకృష్ణాపూర్ పట్టణంలో ప్రస్తుత వేసవి ఎండలను దృష్టిలో పెట్టుకొని ప్రజల దాహార్తిని తీర్చుటకు,మంచి నీటి సరఫరా ను బుధవారం పురపాలక సంఘం కార్యాలయము దగ్గర,రాజీవ్ చౌక్, సూపర్ బజార్,ఏ-జోన్ రామాలయము,రైల్వే స్టేషన్, అమ్మ గార్డెన్ ఏరియాలలో పుర కమిషనర్ ఏ.మారుతి ప్రసాద్, చైర్మన్ గొడెసెల సంధ్యారాణి చలివేంద్రాలను ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రయాణికులు,పుర పట్టణ ప్రజలందరూ చలివేంద్రములలోని తాగునీటిని వినియోగించుకోవాలని కోరారు. ఈ ప్రారంభోత్సవంలో వైస్ చైర్మన్ మిట్టపల్లి సరిత, కౌన్సిల్ సభ్యులు, ఇంచార్జ్ మేనేజర్ కే.సతీష్, ఎం.ఎ.ఇ.ఆశ్రిత్,సంబంధిత వార్డు అధికారులు పాల్గొన్నారు.



## గాంధారి మైసమ్మ దేవస్థానంలో -ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన

**టీ మీడియా, మే 6, రామకృష్ణాపూర్:** క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని బొక్కలగుట్ట శ్రీ శ్రీ శ్రీ గాంధారి మైసమ్మ దేవస్థానంలో బుధవారం ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. పండితుల వేదమంత్రాల నడుమ జరిగిన ఈ కార్యక్రమంలో భక్తులు భారీగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పుర చైర్మన్ గోడిసెల సంధ్యారాణి, డాక్టర్ రాజా రమేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గాంధారి మైసమ్మ దేవస్థానం ప్రాంత ప్రజలకు ఆధ్యాత్మిక కేంద్రంగా నిలుస్తోందని పేర్కొన్నారు. దేవస్థాన అభివృద్ధికి మరిన్ని కార్యక్రమాలు చేపట్టి భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ప్రజల ఆశీర్వాదాలు, సహకారంతో క్యాతనపల్లి ప్రాంతాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి దిశగా తీసుకెళ్తామని వారు అన్నారు. అనంతరం డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లలో నిర్వహించిన గృహప్రవేశ కార్యక్రమంలో కూడా పుర చైర్మన్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ మిట్టపల్లి సరిత శ్రీనివాస్, కౌన్సిలర్లు వీణవంక శ్రీనివాస్, కృపానందం, జంజిపల్లి శశి, బీమా మల్లేష్, ఆలయ కమిటీ సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాలి

- సిపిఐ రాస్తారోకో

**టీ మీడియా, మే 6, రామకృష్ణాపూర్:** సిపిఐ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం క్యాతనపల్లి ఎక్స్ రోడ్ వద్ద సిపిఐ నాయకులు రాస్తారోకో నిర్వహించి పెంచిన గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, పట్టణ కార్యదర్శి మిట్టపెల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్యాస్, డీజిల్, పెట్రోల్‌తో పాటు నిత్యావసర వస్తువుల ధరలు భారీగా పెరిగాయని విమర్శించారు. ధరల పెరుగుదల వల్ల సామాన్య ప్రజలు, రైతులు, హోటల్ నిర్వాహకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ప్రజల సంక్షేమాన్ని విస్మరించి కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆరోపించారు. వెంటనే పెంచిన ధరలను తగ్గించి ప్రజలకు ఉపశమనం కల్పించాలని సిపిఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ఇప్పకాయల లింగయ్య, ఎగూడ మొండి, వనం సత్యం, మిట్టపెల్లి పౌల్, నక్క వెంకటస్వామి, మామిడి గోపి, కౌన్సిలర్లు మద్దెల శంకర్, ముని, కాదండి సాంబయ్య, సిపిఐ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కరీంనగర్ నగల దోపిడీ, కాల్పుల కేసులో పురోగతి

## • పోలీసుల చేతికి కీలక ఆధారాలు




**టీ మీడియా ,మే 6 , కరీంనగర్ :** కరీంనగర్ కాల్పుల ఘటనలో మూడు రోజులైనా నిందితుల ఆచూకీ మాత్రం చిక్కలేదు. నగల దుకాణంలో దోపిడీకి పాల్పడటానికి రెండు రోజుల ముందే ధర్మపురిలో మకాం వేసిన దొంగలు రెక్కి చేసి పక్కా ప్రణాళికతో దాడి చేసినట్లు పోలీసులకు ఆధారాలు లభించాయి. వాళ్లు వాడిన ద్విచక్ర వాహనాలు, హెల్మెట్ సైతం దొరికాయి. దుండగులు బస చేసిన అద్దె గదిని పోలీసులు కనిపెట్టారు. వారు ఎక్కడికి పారిపోయారు? ఎక్కడున్నారో సమాచారం మాత్రం ఇంకా చిక్కలేదు.కరీంనగర్‌లో నగల దుకాణంపై దాడి చేసి కాల్పులు జరిపి కోటికిపైగా విలువ చేసే ఆభరణాలు ఎత్తికెళ్లిన కేసు దర్యాప్తులో క్రమంగా పురోగతి కనిపిస్తోంది. ఈనెల 3న ఐదుగురు దుండగులు కరీంనగర్‌లోని పీఎంజే నగల దుకాణంలోకి చొరబడ్డారు. సిబ్బందిపై కాల్పులు జరిపి బంగారు నగల్ని ఎత్తుకెళ్లారు. దాడి జరపడానికి రెండు రోజుల ముందు వారంతా ధర్మపురిలోని ఓ ప్రైవేటు లాడ్జిలో దిగారు. అక్కడి కరీంనగర్‌కు వచ్చి రెక్కి నిర్వహించి పక్కా ప్రణాళికతో దాడి చేసినట్లు తెలుస్తోంది. ఇందుకు సంబంధించిన ఆధారాలు పోలీసులకు లభించాయి.

**బస చేసిన అద్దె గదిని కనిపెట్టిన పోలీసులు**

మే 1వ తేదీన మధ్యాహ్నం 3 గంటలకు ధర్మపురికి మొదట నలుగురు వచ్చారు. లాడ్జిలో ఏసీ గదిని అద్దెకు తీసుకున్నారు. ఒకటి, రెండు తేదీలకు గాను రూ.2400, మూడో తేదీన ఉదయం 6 గంటలకు ఖాళీ చేసి మరో రూ.600 చెల్లించినట్లుగా రసీదులున్నాయి. తొలుత వచ్చిన నలుగురితోపాటు మరో ఇద్దరు కింద గదికి అద్దెకు తీసున్నట్లు లాడ్జీ యజమానులు చెబుతున్నారు. కరీంనగర్‌కు వచ్చి నగలు దోచుకుని తిరిగి ధర్మపురికి చేరుకుని అక్కడి నుంచి ఇతర ప్రాంతాలకు పారిపోయినట్లుగా తెలుస్తోంది. ఆధారాలు దొరకకుండా తప్పుడు ఆధార్ సంఖ్య, తప్పుడు సమాచారాన్ని రసీదులో నమోదు చేసినట్లు తేలింది.

**సీసీ కెమెరాల్లో నమోదైన దృశ్యాలు**

ధర్మపురిలోని మహాలక్ష్మీ పుష్కర్ ఘాట్ వద్ద దొంగలు వాడిన పల్సర్ బైక్, హెల్మెట్‌ను పోలీసులు గుర్తించారు. వెంటనే జాగిలాలను తెప్పించి గాలింపు చేపట్టినా ఎటువైపు వెళ్లారనే ఆచూకీ మాత్రం లభ్యం కాలేదు. బైక్‌కు వాడిన నెంబర్ ప్లేట్ సైతం కారుదని తేలింది. మరో అపాచీ బైక్ మంచిర్యాల జిల్లా కలమడుగు గ్రామ సమీపంలో లభ్యమైనట్లు సమాచారం. మే 3వ తేదీన ఉదయం ఆరున్నరకు ధర్మపురి నుంచి వెళ్లినట్లుగా సీసీ కెమెరాల్లో నమోదైంది. దోపిడి తర్వాత మధ్యాహ్నం ఒంటిగంటకు ధర్మపురి మండలం నక్కల పెంట మీదుగా వెళ్తున్నట్లు దృశ్యాలు వెలుగులోకి వచ్చాయి.ధర్మపురి నుంచి తిమ్మాపూర్, మద్దునూర్ గండి, గొల్లపల్లి, పెగడపల్లి, రామడుగు మండలాల్లోని గ్రామీణ రోడ్లను వారు ఎంచుకున్నారు. ఎక్కువగా సీసీ కెమెరాలు లేని దారులను ఎంచుకుని ప్రయాణించినట్లు తెలుస్తోంది. ధర్మపురి దాటి దస్తూరాబాద్, ఖానాపూర్, నిర్మల్ వైపు పారిపోయి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. ధర్మపురిలో బైకులు వదిలేసి నడుచుకుంటూ నది దాటి వెళ్లి ఉంటారని అంచనా వేస్తున్నారు. నిందితులను పట్టుకునేందుకు 16 పోలీసు ప్రత్యేక బృందాలు బిహార్ సహా అన్ని అనుమానిత ప్రాంతాల్లో విస్తృతంగా గాలింపు జరుపుతున్నాయి.

**ఆ రోజు ఏం జరిగిందంటే?**

ఉదయం 11 గంటల సమయంలో కరీంనగర్?లోని పీఎంజే జువెల్లరీ షాపులోకి వినియోగదారులుగా వచ్చిన ఐదుగురు దుండగులు లోపలికి వెళ్లి నగలు చూపించమని అడగగా సిబ్బంది ఆభరణాలు చూపించారు. అనంతరం దుండగులు సిబ్బందిని గన్?తో బెదిరించారు. ఆ తర్వాత వారిని కట్టేసి కాల్పులు జరిపి, చూపించిన నగలను కాజేశారు. ఈ క్రమంలో కాల్పుల్లో ముగ్గురు సిబ్బంది గాయపడగా, వారిని ఆసుపత్రికి తరలించారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలానికి చేరుకున్న సీపీ గౌస్? ఆలం విచారణ జరుపుతున్నారు. ఆ దుకాణ సమీపంలోని డ్రైనేజీలో కత్తెర, ప్లాస్టర్?, తుపాకీ మ్యాగ్జిన్? గుర్తించారు. ఘటనా స్థలిలో బుల్లెట్లను స్వాధీనం చేసుకుని సీసీ ఫుటేజీ ఆధారంగా దుండగుల కోసం పోలీసులు ముమ్మరంగా గాలిస్తున్నారు.

---

# కమ్యూనిస్టుల పని అయిపోలేదు...
## మరింత పెరిగింది

**టీ-మీడియా, మే 6 ఖమ్మం :**

కేరళలో అధికారం కోల్పోయిన నేపథ్యంలో "భారతదేశంలో కమ్యూనిస్టుల పని అయిపోయింది" అనే అభిప్రాయం కొన్ని సామాజిక మాధ్యమాల్లో, కొంతమంది వ్యాఖ్యల్లో వ్యక్తమవుతోంది. కానీ వాస్తవ పరిస్థితి దానికి పూర్తి విరుద్ధంగా ఉంది. కమ్యూనిస్టు ఉద్యమాలకు, ప్రజా సమస్యలపై పోరాటాలకు ఇప్పుడు మరింత అవసరం ఏర్పడింది.కేరళ మాజీ ముఖ్యమంత్రి వంటి నాయకులకు ఇప్పుడు దేశవ్యాప్తంగా ప్రజా ఉద్యమాలకు మరింత సమయం కేటాయించే అవకాశం వచ్చింది. మతోన్మాద శక్తులు తమ ఉనికిని కాపాడుకోవడానికి ఒక్కటై, కమ్యూనిస్టు శక్తులు అధికారంలోకి రాకుండా ప్రయత్నించాయి. కానీ అది కమ్యూనిస్టు ఆలోచనల అంతానికి సంకేతం కాదు. కమ్యూనిస్టులు లేని భారతదేశాన్ని ఒక్కసారి ఊహించుకోవాలి. కమ్యూనిస్టు పార్టీలు బలంగా ఉన్న ప్రాంతాల్లో ప్రజలు స్వేచ్ఛగా జీవించారు, ఇంకా జీవిస్తున్నారు. ఇప్పుడు కమ్యూనిస్టు ప్రభావం తగ్గిన ప్రాంతాల్లో పరిస్థితి ఎలా ఉందో ప్రజలే పరిశీలించాలి. గ్రామాల్లో, ప్రాంతాల్లో మాట్లాడితే వాస్తవాలు తెలుస్తాయి.

### ధర్నాలు, నిరసనలు, ఖండనలు

ఇవన్నీ గతంలో ప్రధానంగా కమ్యూనిస్టులే చేపట్టారు. అప్పట్లో ఆ ఉద్యమాలను అణచివేసినవారే ఇప్పుడు అదే పద్ధతులను అనుసరిస్తున్నారు. అంటే ఎవరు ఎవరిని అనుకరిస్తున్నారు అన్నది ఆలోచించాల్సిన విషయం. కమ్యూనిస్టుల వెంట నడుస్తూనే, వారిపైనే విమర్శలు చేయడం కూడా విచిత్రమే.కమ్యూనిజం అజేయం. ఆ భావజాలాన్ని నమ్ముకుని నడిచే కమ్యూనిస్టుల ప్రయాణం కూడా అజేయమే.అయితే ఎన్నికల ఓటముల నుంచి కమ్యూనిస్టు పార్టీలు కొన్ని గుణపాఠాలు నేర్చుకోవాల్సిన అవసరం ఉంది. సమీక్షల తర్వాత అవి మరింత స్పష్టమవుతాయి. ముఖ్యంగా వర్గపోరాటాలను మరింత బలంగా నిర్మించాలి. శత్రువులు చేసే విషప్రచారాన్ని సమర్థంగా తిప్పికొట్టడంలో కమ్యూనిస్టులు కొంత వెనుకబడ్డారు.ప్రస్తుతం సెల్‌ఫోన్ ఒక శక్తివంతమైన ఆయుధంగా మారింది. కానీ కొంతమంది కమ్యూనిస్టు కార్యకర్తలు దాన్ని ప్రజా ప్రచారం కోసం సమర్థంగా వినియోగించకపోవడం కూడా నష్టాలకు కారణమవుతోంది. "పై కమిటీ నుంచి ఆదేశాలు వచ్చిన తర్వాత చూస్తాం" అనే ధోరణి మారాలి. స్వతంత్ర కార్యాచరణ పెరగాలి.

కొన్ని చోట్ల ఉన్నత కమిటీలను ప్రజాస్వామ్య నాయకత్వంగా కాకుండా, అధికార వ్యవస్థలా చూసే పరిస్థితి కూడా పార్టీల్లో కనిపిస్తోంది. ఈ భావజాలం నుంచి బయటకు రావాలి. ఇటువంటి అనేక కారణాలే కేరళలో ఓటమికి, పశ్చిమ బెంగాల్‌లో బలహీనతకు కారణమయ్యాయి.ఏది ఏమైనా, రానున్న కాలంలో కమ్యూనిస్టులకు మంచి భవిష్యత్తు ఉందనే నమ్మకం ఉంది. భారతదేశం వంటి దేశంలో "మాకు దిక్కు, హక్కు కమ్యూనిస్టులే" అని ప్రజలు భావించే రోజులు మళ్లీ వస్తాయి. అవి ఏ రూపంలో వచ్చినా ఆశ్చర్యం లేదు. అలాంటి మార్పుకు పశ్చిమ బెంగాల్ మళ్లీ ఆరంభ బిందువుగా మారే అవకాశం కూడా ఉంది.



**శనగపాటి మురళీకృష్ణ**
ఇండిపెండెంట్ జర్నలిస్ట్
టీ మీడియా కుటుంబము

---

## రేషన్ కార్డు ఉన్నవారికి శుభవార్త..

**టీ-మీడియా ,మే 6 హైదరాబాద్:** తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కీలక ప్రకటన చేశారు. రేషన్ కార్డు ఉన్నవారికి గుడ్ న్యూస్ తెలిపారు. ఇప్పటికే రేషన్ షాపుల ద్వారా బియ్యం. పంచదార పంపిణీ జరుగుతోంది. అయితే త్వరలో మరో ధాన్యాన్ని కర్షీడా చేర్చారు. లబ్దిదారులకు వీటిని పంపిణీ చేయనున్నారు.తెలంగాణలో రేషన్ కార్డు ఉన్నవారికి రేవంత్ సర్కార్ భారీ శుభవార్త అందించింది. రేషన్ కార్డుదారులకు జొన్నలు కూడా పంపిణీ చేయాలని నిర్ణయం తీసుకుంది. రైతుల నుంచి ప్రభుత్వం వీటిని సేకరించి రేషన్ కార్డు లబ్దిదారులకు పంపిణీ చేయనుంది. మార్క్‌ఫెడ్ ద్వారా రైతుల నుంచి జొన్నలను ప్రభుత్వం కొనుగోలు చేయనుంది. అనంతరం రేషన్ దుకాణాల ద్వారా ప్రజలకు అందించనుంది. రైతుల నుంచి తీసుకున్న జొన్నలను బహిరంగ వేలం వేస్తే మధ్యవర్తులు లాభపడతారు. అదే దీనిని రేషన్ కార్డుదారులకు అందించడం వల్లన పేద ప్రజలకు ప్రయోజనం జరగడమే కాకండా వారి ఆకలి తీర్చడంలో ముఖ్యమపాత్ర పోషిస్తుందని ప్రభుత్వం చెబుతోంది.

**జొన్నలు పంపిణీ**

ప్రజాభవన్‌లో రిసోర్స్ మొబిలైజేషన్ కేబినెట్ సబ్ కమిటీ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పాల్గొన్నారు. ఈ సందర్భంగా రేషన్ కార్డుదారులకు జొన్నలు పంపిణీ చేసే విషయంపై కీలక ప్రకటన చేశారు. జొన్నలు పంపిణీ చేయడం వల్ల పేదల ఆకలి తీరడంతో పాటు ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. సామాన్యుడి సంక్షేమం కోసమే తమ ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. రాష్ట్రంలో పండించే మక్కలను నేరుగా పౌల్ట్రీ రైతులకు కేటాయించాలని, ఇందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. ఇక ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల గురుకురాల్లో విద్యార్థులకు పౌష్టికాహారం అందించేందుకు జొన్నలు, మక్కలు వినియోగించాలని అధికారులకు భట్టి విక్రమార్క సూచించారు. అలాగే మక్కలను నేరుగా పౌల్ట్రీ రైతులకు కేటాయించాలని సూచించారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంపై తమ ప్రభుత్వం దృష్టి పెట్టిందని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. అటు యాసంగి పంటకు సంబంధించి జొన్నలు, మొక్కజొన్నలు కొనుగోలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. కేంద్ర సహకారం లేకపోవడంతో రాష్ట్ర నిధులతోనే సేకరించనున్నట్లు తెలిపింది. ఇప్పటికే మొక్కజొన్న కొనుగోళ్లు మొదలవ్వగా.. జొన్నల కొనుగోళ్లు కూడా త్వరలో ప్రారంభించనుంది.

**ఏపీలో జరుగుతున్న పంపిణీ**

అటు ఏపీలో ఇప్పటికే రేషన్ దుకాణాల ద్వారా జొన్నలు, రాగులు పంపిణీ చేస్తున్నారు. కొంత బియ్యం కోటాకు బదులు రాగులు, జొన్నలు అందిస్తున్నారు. అలాగే గోధుములు కూడా కొన్ని ప్రాంతాల్లో పంపిణీ చేస్తుండగా.. మరికొన్ని జిల్లాల్లో కూడా త్వరలో పంపిణీ మొదలుపెట్టనున్నారు. ఇక కందిపప్పు కూడా తక్కువ ధరకు గతంలో పంపిణీ చేయగా.. ప్రస్తుతం గత కొద్ది నెలలుగా ఆగిపోయింది. ప్రభుత్వం వద్ద నిల్వలు లేకపోవడంతో రేషన్ దుకాణాలకు సరఫరా నిలిచిపోయింది. దీంతో త్వరలో మళ్లీ కందిపప్పు పంపిణీ కూడా మొదలుపెట్టాలని ప్రభుత్వం చూస్తోంది. దీంతో వీటి కోసం పేదలు ఎదురుచూస్తున్నారు.

---



## హైదరాబాద్-చండీగఢ్ విమానంలో
### • పవర్ బ్యాంక్ పేలుడు

**టీ-మీడియా ,మే 6 , న్యూఢిల్లీ బ్యూరో :** హైదరాబాద్ నుంచి చండీగఢ్‌కు బయల్దేరిన ఇండిగో విమానంలో ఓ ప్రయాణికుడి పవర్ బ్యాంక్ నుంచి మంటలు చెలరేగటం అందర్నీ ఆందోళనకు గురిచేసింది. మంగళవారం మధ్యాహ్నం చండీగఢ్‌లోని షహీద్ భగత్‌సింగ్ విమానాశ్రయానికి చేరుకున్న ఇండిగో విమానం క్యాబిన్‌లో పొగను గుర్తించటంతో అధికారులు అప్రమత్తమై అత్యవసర భద్రతా చర్యల్ని చేపట్టారు.అత్యవసర స్లైడ్‌లను ఉపయోగించి విమానంలోని ప్రయాణికులను, సిబ్బందిని ఖాళీ చేయించారు. అత్యవసర తరలింపు సమయంలో ఒక ప్రయాణికుడు గాయపడ్డట్టు తెలిసింది. తన పవర్‌బ్యాంక్‌లో పేలుడు సంభవించి మంటలు చెలరేగాయని ఒక ప్రయాణికుడు విమాన సిబ్బందికి తెలుపటంతో, విమానంలోని 198 మంది ప్రయాణికులు, ఆరుగురు సిబ్బందిని అత్యవసరంగా కిందకు దించారు. విమానాశ్రయానికి చేరుకున్న కొద్ది నిమిషాల్లోనే.. విమానం క్యాబిన్‌లో పొగ నిండిపోవటం, ఆ వెంటనే అలారం మోగటం టెన్షన్ వాతావరణాన్ని తీసుకొచ్చింది.

---

# వస్తావా.?
## అని అడిగారు
### వెళ్లాక అసలు సినిమా చూపించింది




**టీ మీడియా ,మే 6 హైదరాబాద్, మల్కాజ్‌గిరి:** పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు తీసుకున్న తొలిరోజే గ్రౌండ్ సిట్యుయేషన్‌పై ఫోకస్ చేసిన సుమతి.. పోకిరీలకు ఊహించని షాక్ ఇచ్చారు. అర్ధరాత్రి ఫీల్డ్‌లోకి ఎంట్రీ ఇచ్చిన ఆమె.. సంచలన ఆపరేషన్ నిర్వహించారు. ఇటీవల కాలంలో అరాచకాలకు అడ్డాగా మారిన దిల్‌సుఖ్‌నగర్ బస్టాండ్‌ను ఎంచుకున్నారు. అర్ధరాత్రి వేళ.. ఒంటరిగా, ఎలాంటి సెక్యూరిటీ లేకుండా.. ఆ ఏరియాకు వెళ్లారు సుమతి. పోలీస్ కమిషనర్‌గా కాదు, సగటు మహిళగా రోడ్డుపై బస్సుకోసం ఎదురుచూస్తూ నిల్చున్నారు. అర్ధరాత్రి 12గంటల నుంచి మూడింటి వరకు.. ఆమె అక్కడే ఉన్నారు. కమిషనర్‌గా సెక్యూరిటీ మధ్య కాదు.. కామన్ లేడీగా అర్ధరాత్రి రోడ్డెక్కితే.. పరిస్థితి ఎలా ఉంటుందో, కళ్లారా చూశారు.ఇక, ఇంతలో అక్కడ అసలు సినిమా మొదలైంది. సుమతి ఎవరో తెలియక పోకిరీలు చుట్టు ముట్టేశారు. అందరూ వస్తావా అనేవాళ్లే? ఎంతివ్వాలంటూ ఆఫర్ ఇచ్చేవాళ్లే? ఎటు వెళ్దామంటూ అడిగే బాపతుగాళ్లే? అసలు ఇప్పటివరకూ ఆడముఖమే చూడనట్టుగా ఎగబడిపోయారు కొందరు. ఒకటి కాదు రెండు కాదు, దాదాపు మూడుగంటల పాటు.. దిల్ సుఖ్ నగర్ మెయిన్‌రోడ్డుపై ఇదే సీన్. అటువైపుగా ఒక్క పోలీస్ కూడా రాలేదు, పెట్రోలింగ్ వెహికిలూ రాలేదు. దీంతో, మరింత రెచ్చిపోయిన పోకిరీలు.. ఆమె తప్పించుకుని ముందుకు వెళ్తున్నా వినలేదు. బైకులు తీసుకొచ్చి ఆమె ముందే ఆపారు. వెకిలి చేష్టలతో విసుగు పుట్టించారు.సుమతిని చుట్టుముట్టిన పోకిరిల్లో ఎక్కువ మంది విద్యార్థులే ఉండటం పరిస్థితికి అద్దం పడుతోంది. వాళ్లంతా మద్యం, గంజాయి మత్తులో ఉన్నారు. ఆ మైకంలోనే..అసభ్య ప్రశ్నలతో సుమతిని తీవ్రంగా ఇబ్బంది పెట్టారు. అయినా ధైర్యంతో అక్కడే నిలబడి.. అందర్నీ గమనిస్తూ ఉండిపోయారు సుమతి. చివరాఖరికి సమయం మూడున్నర అవుతుండగా... అటువైపు వచ్చాడో బీట్ కానిస్టేబుల్. అప్పటిదాకా ఆమె చుట్టూ మృగాళ్ల మధ్య అక్కడ ఒంటరే. అప్పుడే ఆమె ఎవరో తెలిసింది. ఆ తర్వాత ఓ ఎస్సై వచ్చి సెల్యూట్ కొట్టగానే.. ఆమె లేడీ సింగం... విశ్వనగరపు తొలి మహిళా పోలీస్ కమిషనర్ ఐపీఎస్ సుమతి అని తెలిసిపోయింది. అది చూసి షాకవడం పోకిరీల వంతయ్యింది.

అప్పటిదాకా.. క్యా పొట్టీ హై మామా అంటూ కామెంటేసిన ఆకతాయిలు.. పోలీస్ జీప్ ఎక్కాల్సి వచ్చింది. ఈ మూడుగంటల ఆపరేషన్‌లో దాదాపు 40మంది పోకిరీల పనిపట్టారు ఐపీఎస్ సుమతి. వాళ్లందరినీ అదుపులోకి తీసుకుని కౌన్సిలింగ్ ఇచ్చారు. వారిలో ఎక్కువ మంది విద్యార్థులు, ఉద్యోగార్థులే ఉన్నట్టు గుర్తించారు. చుట్టూ ఉన్న హాస్టల్స్‌లో నివాసముంటున్న ఈ బ్యాచ్.. రాత్రయితే చాలు ఇలా రోడ్లమీద పడుతున్నట్టు గుర్తించిన సుమతి... మూడ్రోజులుగా ఈ ఏరియాపై స్పెషల్ ఫోకస్ చేశారు. అలాంటి బ్యాచ్‌కు ఇప్పుడు.. అదిరిపోయే షాకిచ్చారు. రోడ్డుపై ఆడపిల్ల కనిపించగానే చొంగ కార్చడం కాదు... చొరవ తీసుకుని వీలైతే సాయం చేయాలని సూచించారు. చదువు, కెరీర్ మీద ఫోకస్ చేయాలనీ బ్రెయిన్ వాష్ చేయడమే కాదు... మద్యం, గంజాయి అలవాట్లను వదులుకోకపోతే తోకలు కత్తిరిస్తానని హెచ్చరించి పంపించారు.అర్ధరాత్రి ఆడసింగం... హైదరాబాద్‌లో ఇప్పుడీ స్పెషల్ ఆపరేషన్ హాట్‌టాపిక్‌గా మారింది. అయితే ఇలాంటి సాహసాలు చేయడం సుమతికి కొత్తేం కాదు. 2001లో డీఎస్పీగా బాధ్యతలు తీసుకున్నాక... కాజీపేట రైల్వే స్టేషన్ దగ్గర కూడా... ఇలాగే నిలబడ్డారు సుమతి. ఆడది కనిపిస్తే అంగడి సరుకులా భావించే మగమృగాళ్లకు బుద్ధి చెప్పారు. సరిగ్గా పాతికేళ్ల తరువాత... మళ్లీ అలాగే... తనస్టయిల్‌లో పోకిరీలకు బుద్ధి చెప్పారు. కాకపోతే, ఈసారి అడ్డా దిల్‌సుఖ్‌నగర్ బస్టాప్‌కు మారింది. ఆవిడ ఐపీఎస్ సుమతి కాబట్టి... పక్కా వ్యూహంతో, ప్లానింగ్‌తో వెళ్లారు కాబట్టి ... ఎలాంటి ప్రమాదమూ జరగలేదు. అదే నిజంగా ఒక కామన్ ఉమన్ ఆ ప్లేసులో ఉండుంటే... ఆ నలభై మంది మృగాళ్ల మధ్య.. పరిస్థితి ఏమయ్యేది. ఊహించడానికే భయానకంగా ఉంది కదా. అంటే.. ఇప్పటికీ హైదరాబాద్ నగరంలో అలాంటి భయానక పరిస్థితులు ఉన్నాయనే దానికి.. మాత్రం లేటెస్ట్ పోలీస్ ఆపరేషన్.. అద్దం పడుతోంది.

---




## ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులకు భారీ ఊరట

**టీ-మీడియా ,మే 6 ,హైదరాబాద్ బ్యూరో :** తెలంగాణ ఆర్టీసీలో స్టాఫ్ రిటైర్మెంట్ బెనిఫిట్ సీమ్ లబ్ధిదారులకు సంస్థ భారీ ఊరటనిచ్చింది. విశ్రాంత ఉద్యోగులు, వారి జీవిత భాగస్వాములు తమ నెలవారీ నగదు ప్రయోజనాన్ని పొందడానికి ఇకపై డిపోల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదు. కేంద్ర ప్రభుత్వ 'జీవన్ ప్రమాణ్' పోర్టల్ ద్వారా డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్లను (డీఎల్‌సీ) సమర్పించే వెసులుబాటును కల్పిస్తూ టీజీఎస్ ఆర్టీసీ ఎస్‌ఆర్‌బీఎస్ చైర్మన్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

---

# తెలంగాణలో గిగ్ వర్కర్లకు భారీ ఊరట

- సంక్షేమ బిల్లుకు గవర్నర్ ఆమోదం..
- డెలివరీ బాయ్స్, క్యాబ్ డ్రైవర్లకు చట్టబద్ధ రక్షణ

**టీ మీడియా, హైదరాబాద్, మే 06:**
తెలంగాణలో స్విగ్గీ, జొమాటో, ర్యాపిడో, ఓలా, ఉబెర్ వంటి ప్లాట్‌ఫామ్‌లలో పనిచేస్తున్న లక్షలాది మంది గిగ్ వర్కర్లకు రాష్ట్ర ప్రభుత్వం కీలక శుభవార్త అందించింది. "తెలంగాణ ప్లాట్‌ఫామ్ బేస్డ్ గిగ్ వర్కర్స్ బిల్లు--2026"కు రాష్ట్ర గవర్నర్ ఆమోదం తెలపడంతో చట్టం అమల్లోకి వచ్చింది. మే డే సందర్భంగా ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ కూడా విడుదల చేసింది.
ఈ చట్టంతో రాష్ట్రంలోని డెలివరీ బాయ్స్, క్యాబ్ డ్రైవర్లు, యాప్ ఆధారిత కార్మికులకు మొదటిసారిగా చట్టబద్ధ గుర్తింపు లభించనుంది. గిగ్ వర్కర్లకు సామాజిక భద్రత, ఉద్యోగ భద్రత, సంక్షేమ ప్రయోజనాలు కల్పించడమే ఈ బిల్లులో ప్రధాన ఉద్దేశ్యంగా ప్రభుత్వం పేర్కొంది.
బిల్లులో ప్రధాన అంశాలు

**గిగ్ వర్కర్ల కోసం ప్రత్యేక వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు**

ప్రతి కార్మికుడికి ప్రత్యేక యూనిక్ ఐడీ
హెల్త్ ఇన్సూరెన్స్, పెన్షన్, ప్రసూతి ప్రయోజనాలు
వేతనాలు, కోతల వివరాల్లో పారదర్శకత
ఫిర్యాదుల పరిష్కారానికి ప్రత్యేక కమిటీలు




**ప్లాట్‌ఫామ్ సంస్థలపై కఠిన నిబంధనలు**

ప్రతి ట్రాన్సాక్షన్‌పై 1 నుంచి 2 శాతం వరకు లెవీ వసూలు చేసి వెల్ఫేర్ ఫండ్ ఏర్పాటు చేయనున్నట్లు ప్రభుత్వం తెలిపింది. ఈ నిధులను గిగ్ వర్కర్ల సంక్షేమ కార్యక్రమాలకు వినియోగించనున్నారు.

**నిబంధనలు ఉల్లంఘిస్తే భారీ జరిమానాలు**

బిల్లులో భాగంగా ప్లాట్‌ఫామ్ కంపెనీలు ప్రతి మూడు నెలలకు ఒకసారి తమ కార్యకలాపాల వివరాలను ప్రభుత్వానికి సమర్పించాల్సి ఉంటుంది. నిబంధనలు పాటించని సంస్థలకు భారీ జరిమానాలు విధించనున్నారు. మొదటిసారి రూ.50 వేల వరకు, రెండోసారి రూ.1 లక్ష, మూడోసారి రూ.1.5 లక్షల వరకు ఫైన్ విధించే అవకాశం ఉంది.

**కార్మిక సంఘాల హర్షం**

ఈ నిర్ణయంపై గిగ్ వర్కర్ల సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి. ఎన్నో ఏళ్లుగా సామాజిక భద్రత లేకుండా పనిచేస్తున్న తమకు ఈ చట్టం భరోసానిస్తుందని పేర్కొన్నాయి. ముఖ్యంగా ప్రమాద బీమా, ఆరోగ్య భద్రత, ఉద్యోగ హక్కుల పరిరక్షణలో ఇది కీలక మైలురాయిగా అభివర్ణించాయి.

